జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 7 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 6

తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : ఎమ్మెల్యే జారే

- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే
- సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీస్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి సన్మానం
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ములకలపల్లి, నవంబర్ 6 (ప్రజాజ్యోతి): మురసు తుఫానుతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే

మిగతా 2 లో...



ప్రేమించి పెళ్లాడి.. ప్రాణం తీసి నదిలో పడేసాడు!

- నాలుగు నెలల గర్భవతిని కిరాతకంగా హతమార్చిన ఏఆర్ కానిస్టేబుల్ నరేందర్
- మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి.. బైక్‌పై భద్రాచలం తరలింపు
- తండ్రి సహకారంతో గోదావరి వంతెన పైనుంచి నదిలోకి విసిరేసిన ఘోరం
- బూర్గంపాడు సమీపంలో లభ్యమైన భవాని మృతదేహం
- కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- చావుకు దారితీసిన 'ఇన్‌స్టాగ్రామ్' ప్రేమకథ.. సమాజాన్ని విస్తుపోయేలా చేసిన దారుణం
- 'ప్రజాజ్యోతి' విశ్లేషణాత్మక క్రైమ్ కథనం

2 లో..

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

మార్చిలోగా వీబీ - జి రామ్ జి ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యాన్ని సాధించాలి

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 6,(ప్రజాజ్యోతి) ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరును మెరుగుపరచాలని, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, నిర్దేశిత లక్ష్యాల సాధనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రం లోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ, వి బి జి ఆర్ ఎం జి చేయూత పింఛన్ల వెరిఫికేషన్, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఐడీఓసీ కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం పెంచాలి

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను జనవరి మొదటి వారంలోగా 100 శాతం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద రూ.538 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు

మిగతా 2 లో...

మావోయిస్టుల భూగర్భ డంప్ గుర్తింపు

- 955 డిటోనేటర్లు, భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం



చర్ల, నవంబర్ 06:(ప్రజాజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నక్సల్ ప్రభావిత బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల కార్యకలాపాలపై భద్రతా దళాలు కీలక చర్య చేపట్టాయి. ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పూజారికంకర్ గ్రామ సమీప అటవీ, కొండ ప్రాంతంలో మావోయిస్టులు భూగర్భంలో దాచిపెట్టిన భారీ పేలుడు పదార్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాల డంప్‌ను భద్రతా దళాల సంయుక్త బృందం గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 955 డిటోనేటర్లు సహా పలు సాంకేతిక పరికరాలు, మావోయిస్టు సాహిత్యం లభ్యమయ్యాయి.పోలీసుల వివరాల ప్రకారం మావోయిస్టులు అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని రహస్యంగా నిల్వ చేసినట్లు 204వ కోబ్రా బెటాలియన్ ఇంటెలిజెన్స్ విభాగానికి విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బీజాపూర్ జిల్లా పోలీసు బలగాలు, 204వ కోబ్రా బెటాలియన్ సంయుక్తంగా పూజారి కంకర్ గ్రామ పరిసర

మిగతా 2 లో...

పాలన గాలికి.. సీఎం ఢిల్లీకి!

- ఇతర రాష్ట్రాలు ముందే హెచ్చరించి నీటిని వాడుకుంటే.. మనవాళ్లు నిద్రమత్తులో ముంచేశారు
- ఉమ్మడి ఖమ్మం మంత్రుల వైఫల్యంతోనే జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం
- రాష్ట్రంలో నడుస్తోంది 'తుగ్లక్ పాలన'.. రైతుల కంటికన్నీరే సాక్ష్యం
- సామాన్యుడి పొట్ట కొడుతున్న కాంగ్రెస్.. మార్కెట్‌లో ఆకాశాన్నంటిన బియ్యం ధరలు
- మళ్లీ కేసీఆర్ 'స్వర్ణయుగం' కావాలని తలచుకుంటున్న ప్రజానీకం
- 'ప్రజాజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ లో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర ధ్వజం

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (ప్రజాజ్యోతి):

రాష్ట్రంలో ప్రజా సమస్యలను పూర్తిగా పక్కనబెట్టి, ముఖ్యమంత్రి ఎప్పుడు



చూసినా ఢిల్లీ పర్యటనల్లోనే తేలియాడుతున్నారని బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసలైన

మిగతా 2 లో...

తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : ఎమ్మెల్యే జారే





(మొదటి పేజీ తరువాయి...)

ఆదినారాయణభరోసా ఇచ్చారు. తుఫాన్ ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, పంట పొలాలను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధిత రైతులు, కుటుంబాలతో మాట్లాడి జరిగిన నష్టాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పాతగంగారం, ముత్యాలంపాడు, జగన్నాథపురం, మూకమామిడి, చౌటిగూడెం, ములకలపల్లి, తాళ్లపాయి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. తుఫాన్ బీభత్సంతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నష్టాలపై అధికారులు సమగ్రంగా వివరాలు సేకరించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల రాకపోకలకు, రైతుల వ్యవసాయ పనులకు ఇబ్బందులు కలగకుండా దెబ్బతిన్న రహదారులు, వంతెనల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాల చెక్కులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీచేశారు. పేదకుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

సహాయక సిబ్బందికి సన్మానం

తుఫాన్ సమయంలో విపత్కర పరిస్థితుల్లో సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొని ప్రజలను రక్షించిన పోలీస్ సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. రెస్క్యూ ఆపరేషన్లలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ మధుప్రసాద్ తో పాటు ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. అలాగే తుఫాన్ సమయంలో ప్రజలకు సేవలందించిన విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు గ్రామ సర్పంచులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో అరుణ్ బాబు, ఐటీడీఏ డీఈ పూసం బాపనయ్య, ఏఈ సుబ్బరాజు, విద్యుత్ శాఖ ఏఈ నరేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్, మండల అధ్యక్షుడు జహీర్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకపల్లి వీరభద్రరావు, నాయకులు తాండ్ర ప్రభాకర్ రావు, పేటేటి నరసింహారావు, బత్తుల అంజి, కారం సుధీర్, పాలకుర్తి సుమిత్, కోడిమే వంశీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల భూగర్భ డంప్ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి...)

అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో గ్రామానికి ఆగ్నేయ దిశలో అనుమానాస్పదంగా ఉన్న భూగర్భ నిల్వ కేంద్రాన్ని గుర్తించి తనిఖీలు నిర్వహించగా భారీగా పేలుడు సామగ్రి బయటపడింది. స్వాధీనం చేసుకున్న వాటిలో 455 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 500 నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు కలిపి మొత్తం 955 డిటోనేటర్లు ఉన్నాయి. వీటితో పాటు రెండు మల్టీమీటర్లు, రెండు రేడియో సెట్ బ్యాటరీ ఛార్జర్ కప్పులు, రెండు రాగి ప్రోటోటైపింగ్ బోర్డులు, మల్టీ యూఎస్బీ పోర్ట్ కార్డ్ రీడర్, మొబైల్ ఛార్జర్, ల్యాప్‌టాప్ అడాప్టర్, 12 వోల్ట్ ఎఫ్ఎం/ఏఎం పవర్ యాంటెన్నా, టెలిస్కోపిక్ యాంటెన్నాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా టైప్–బి డేటా కేబుల్, సుమారు ఎనిమిది మీటర్ల విద్యుత్ తీగ, రిలే కంట్రోల్ సర్క్యూట్ బోర్డు, స్నాప్ హుక్‌తో పాటు మావోయిస్టు సాహిత్యం కూడా లభ్యమైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో 204వ కోబ్రా బెటాలియన్ ఇంటెలిజెన్స్ విభాగం కీలక పాత్ర పోషించగా, జిల్లా పోలీసు బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు నిర్వహించాయి. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని ఉసూర్ పోలీస్‌స్టేషన్ అధికారులు జప్తు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. లోతట్టు, కొండ ప్రాంతాల్లో మావోయిస్టులు రహస్యంగా ఏర్పాటు చేస్తున్న నిల్వ కేంద్రాలను గుర్తించడంలో భద్రతా దళాలు నిఘాను మరింత ముమ్మరం చేశాయి అని అధికారులు తెలిపారు.

ప్రేమించి పెళ్లాడి.. ప్రాణం తీసి నదిలో పడేసాడు!

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి / భద్రాచలం, నవంబర్ 6 (ప్రజాజ్యోతి): సమాజంలో చట్టాన్ని కాపాడాల్సిన చేతులే కాలయముడిగా మారితే, నిండు నూరేళ్ల రక్షణ ఇవ్వాల్సిన భర్తే రాక్షసుడిగా పరిణమిస్తే.. ఆ ఆలుమగల బంధానికే కాదు మొత్తం మానవత్వానికే తీరని కళంకం ఏర్పడుతుంది. వేదమంత్రాల సాక్షిగా ఏడడుగులు నడిచినా, సామాజిక మాధ్యమాల మెరుపుల్లో ప్రేమ ఒలికించినా.. అంతిమంగా అనుమానం, వేధింపులే ఒక నిండు ప్రాణాన్ని, కడుపులో పెరుగుతున్న ఐదో ప్రాణాన్ని నిష్కారణంగా పొట్టనబెట్టుకున్నాయి. ప్రేమతో పెండ్లాడిన భవానిని కనుపాపలా కాపాడాల్సిన ఏఆర్ కానిస్టేబుల్ నరేందర్, నాలుగు నెలల గర్భవతి అయిన తన భార్యను అత్యంత కిరాతకంగా చంపి, మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి గోదావరి పాలేసిన నరరూప రాక్షసుడి ఉదంతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని, భయాందోళనను రేకెత్తించింది.

తండ్రి సహాయంతో..

పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నరేందర్, తన భార్య భవానిని రెండు రోజుల క్రితం అత్యంత క్రూరంగా హతమార్చాడు. ఆపై ఈ ఘోరకాలాన్ని కప్పిపుచ్చేందుకు తన కన్నతండ్రి సహాయం తీసుకున్నాడు. కనీసం కడుపులో ఎదుగుతున్నసొంత నెత్తుటి రూపాన్ని కూడా చూడకుండా, మృతదేహాన్నిఒక గోనెసంచిలో కుక్కి, ద్విచక్రవాహనంపై కొత్తగూడెం నుండి భద్రాచలానికి తరలించడం వారి రాక్షసత్వానికి అద్దం పడుతోంది. గురువారం అర్ధరాత్రి భద్రాచలం గోదావరి పంతెనపైకి చేరుకుని, 25వ పిల్లర్ వద్ద నుంచి ఆ మూటను నదిలోకి విసిరేసి ఏమీ తెలియనట్లు వెళ్ళిపోయారు. అక్కడ నుండి నిందితుడు ఏఆర్ కానిస్టేబుల్ నరేందర్ నేరుగా కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయి తన నేరాన్ని అంగీకరించాడు. వెంటనే అప్రమత్తమైన త్రీటౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి నేతృత్వంలో రాత్రికి రాత్రే భద్రాచలం చేరుకున్న పోలీసు బృందం, శుక్రవారం ఉదయం స్థానిక గజ ఈత గాళ్లతో గోదావరిలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో బూర్గంపాడు సమీపంలో భవాని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోరంపై సీఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరుపుతున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా భవాని, నరేందర్‌లకు పరిచయం..

అయితే ఈ దారుణ ఉదంతం వెనుక ఉన్న నేపథ్యం సమాజాన్ని తీవ్రంగా ఆలోచింపజేస్తోంది. రెండేళ్ల క్రితం సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా భవాని, నరేందర్‌లకు పరిచయం ఏర్పడి, ఆ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఇరువైపులా నుండి గుడిలో వివాహం చేసుకున్నారు. ఎనిమిది నెలల క్రితం భవాని ఒక మగబిడ్డకు జన్మనివ్వగా, దురదృష్టవశాత్తు పుట్టిన రెండు నెలలకే ఆ పసిపాప మరణించాడు. కడుపుకోతతో నరకం అనుభవిస్తున్న భార్యను ఆదుకోవాల్సిన భర్తే ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. గతంలోనే తనకు భర్త నుండి ప్రాణహాని ఉందని భవాని పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, కాలక్రమంలో ఆ వేధింపులు రాక్షసత్వంగా మారి చివరికి ఆమెను బలి తీసుకున్నాయి. చివరిగా ఈ ఉదాంతం ఇక తీవ్రమైన విశ్వదంగా ముగిసింది.

నైతిక పతనానికి నిదర్శనం.. ఈ ఘటన

ఈ ఘటన కేవలం ఒక నేరం మాత్రమే కాకుండా, నేటి సమాజంలోని చంచలమైన బంధాలకు, క్షీణిస్తున్న మానవీయ విలువలకీ ఒక పెద్ద ప్రమాద హెచ్చరికగా నిలిచింది. ఇన్‌స్టాగ్రామ్ లైకులు, చాటింగ్‌లు జీవితకాల నమ్మకానికి ప్రాతిపదిక కావని, బాధ్యత లేని మోజులు ఎంత ప్రమాదకరమో ఈ సంఘటన స్పష్టం చేస్తోంది. సమాజంలో నేరాలను అరికట్టే శిక్షణ పొందిన ఒక పోలీస్ సిబ్బందే ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం, దానికి కన్నతండ్రి కూడా తోడవ్వడం వ్యవస్థలోని నైతిక పతనానికి నిదర్శనం. అనుమానాలు, క్షణికావేశాలు ఇంకెన్ని నిండు ప్రాణాలను బలి తీసుకుంటాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక గర్భవతిని, కడుపులోని నిరుపాపిని బలితీసుకున్న ఈ మానవ మృగానికి చట్ట ప్రకారం కఠినమైన శిక్ష పడాలని, అప్పుడే భవాని ఆత్మకు శాంతి చేకూరుతుందని స్థానికులు, హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి

(మొదటి పేజీ తరువాయి...)

10 శాతం కూడా ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 794 పీఎం శ్రీ పాఠశాలల్లో నిధుల వినియోగంతో పాటు విద్యాప్రమాణాల మెరుగుదలపై కలెక్టర్లు దృష్టి సారించాలని తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర శిక్ష, వి బి జి ఆర్ ఎం జి నిధులను సమన్వయంతో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫారాలు, కిట్లు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలని ఆదేశించారు, అదేవిధంగా రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా వేసవి ముగిసే వరకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి వారం సమావేశమై సరఫరా పరిస్థితిని సమీక్షించాలని తెలిపారు. చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులకు అవసరమైన మరమ్మతులు నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి వృథాను అరికట్టడంతో పాటు అక్రమ కనెక్షన్లు, ట్యాపింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వి బి జి ఆర్ ఎం జి పథకం ద్వారా నాణ్యమైన, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పనులు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని, మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్‌లో ఉన్న ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు కొత్త లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం 'మన ఇసుక – మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఒక్కో సిమెంట్ బస్తాను రూ.230 చొప్పున లబ్ధిదారులకు సరఫరా చేయాలని, సబ్సిడీ ద్వారా లభించే ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ నాగలక్ష్మి , కొత్తగూడెం ఆర్డీఓ మధు, హౌసింగ్ పీడీ సవేరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి శంభు ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి అనూష, అదనపు డీఆర్డీఓ రవి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలన గాలికి.. సీఎం ఢిల్లీకి!

(మొదటి పేజీ తరువాయి...)

పాలన మరుగున పడి కేవలం 'తుగ్లక్ పాలన' మాత్రమే సాగుతోందని ఆయన ఆరోపించారు. శుక్రవారం కొత్త గూడెం లోని బిఆర్ఎస్ భవన్ లో 'ప్రజాజ్యోతి'తో ముచ్చటించిన ఆయన.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతాంగానికి జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా నిలదీశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ... ఇటీవల ఎల్నినో వాతావరణ పరిస్థితులను, నీటి నిల్వలను పొరుగు రాష్ట్రాలు ముందే గ్రహించి ఎంతో తెలివిగా జాగ్రత్త పడ్డాయని తెలిపారు. అలా పక్క రాష్ట్రాలన్నీ నీటి నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి ప్రజలను, రైతులను కాపాడుకుంటే, మన తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్ల రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. సమయానికి నీటిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోకుండా, పంటలను ఎండబెట్టి రైతుల పొట్ట కొట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల తీరుపై వద్దిరాజు రవిచంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, వారు కేవలం మీడియా ముందుకు వచ్చి నటించడానికే పరిమితమయ్యారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో రైతులకు జరుగుతున్న నష్టాన్ని నివారించడంలో ముగ్గురు మంత్రులు పూర్తిగా విఫలమయ్యారని ఎండగట్టారు. మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం, వారి పట్టింపులేని తనం వల్లనే ఈరోజు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం కన్నీటిపర్యంతమవుతోందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి ఇక్కడ రైతుల కష్టాలను పట్టించుకోవడం వదిలేసి, ఎక్కువ సమయం ఢిల్లీ వీధుల్లోనే గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పైశాచిక వైఖరి, అసంబద్ధ నిర్ణయాల వల్లనే ఈరోజు మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్య ప్రజలు తిండికి కూడా అల్లాడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో రైతులకు వేళకు నీళ్లు, ఉచిత విద్యుత్, రైతుబంధు అంది సర్వతోముఖాభివృద్ధి జరిగిందని, అందుకే ఆ నాటి 'స్వర్ణయుగాన్ని' ప్రజలందరూ ఈరోజు ఎంతో గుర్తుచేసుకుంటున్నారని వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

టీబీ గుర్తింపునకు ప్రత్యేక ఎక్స్‌రే శిబిరం

- 65 మందికి టీబీ ఎక్స్‌రే పరీక్షలు



చర్ల, నవంబర్ 06: (ప్రజా జ్యోతి): చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొగళ్ళపల్లి గ్రామంలో టీబీ వ్యాధి గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఎక్స్‌రే పరీక్షల శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ సందర్శించి పరిశీలించారు. ఈ శిబిరంలో మొత్తం 65 మంది ఎక్స్‌రే పరీక్షల సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీడీఎంహెచ్ఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చిన విలువైన ఎక్స్‌రే పరికరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయినంత మాత్రాన ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రస్తుతం ఈ వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయి వైద్యం ఉచితంగా అందుబాటులో ఉందని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని వివరించారు. చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారిక మాట్లాడుతూ గోర్లు, వెంట్రుకలు మినహా శరీరంలోని దాదాపు అన్ని భాగాలకు టీబీ వ్యాధి సోకే అవకాశం ఉందని తెలిపారు. వ్యాధి లక్షణాలపై చిన్నపాటి అనుమానం వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ బాధితులకు ఉచితంగా మందులు అందించడంతో పాటు, మందులు వాడుతున్న కాలంలో ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చని అన్నారు.అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించి, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మొగళ్ళపల్లి సర్పంచ్ సత్యవతి, ఉపసర్పంచ్ ఎర్ర రామదాసు, పంచాయతీ కార్యదర్శి నవీన్, టీబీ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, ఎక్స్‌రే టెక్నీషియన్ శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజర్ సీతారామయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు నరసింహ, ధర్మ, స్వరాజ్యం, ఆశా కార్యకర్తలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రుల అనుచరుల ముసుగులో అక్రమ దందాలు!

- ప్రభుత్వ ధాన్యం అక్రమాలపై విచారణ జరపాలి
- తెలంగాణ రక్షణ సమితి నాయకురాలు కనగాల చైతన్య డిమాండ్



భద్రాచలం, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): మంత్రుల అనుచరులమంటూ రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకొని కొందరు వ్యక్తులు కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నారని తెలంగాణ రక్షణ సమితి రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య ఆరోపించారు. ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఆళ్ల మురళి అనే వ్యక్తి ఓ మంత్రికి అనుచరుడినంటూ ప్రభుత్వ ధాన్యం అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న సూత్రధారులు, వారికి అండగా ఉన్న రాజకీయ నాయకుల వివరాలను బయటపెట్టాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీలోని కొందరు కీలక నేతల పాత్రపై కూడా విచారణ జరగాలని అన్నారు.ఏజెన్సీ ప్రాంత ప్రజలను మోసం చేస్తూ ఆర్థిక అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లు, నిల్వలు, రవాణా రికార్డులను పరిశీలించి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కనగాల చైతన్య డిమాండ్ చేశారు.

నేడు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

- భద్రాచలం తహసీల్దార్ కోటా రవికుమార్

భద్రాచలం, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): భద్రాచలం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న రైతు వేదికలో శనివారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులతో పాటు రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు భద్రాచలం తహసీల్దార్ కోటా రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, సర్పంచ్ పూనెం కృష్ణ, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు నిర్ణీత సమయానికి రైతు వేదికకు చేరుకోవాలని తహసీల్దార్ సూచించారు.

విద్యతోనే జీవితానికి వెలుగులు



చర్ల, నవంబర్ 06(ప్రజా జ్యోతి): విద్యార్థులు తమలోని శక్తి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ చదువులో రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని చర్ల హనుమాన్ జ్యూయలరీస్ యజమాని తంగిళ్లపల్లి లక్ష్మణాచారి అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని చర్లలోని వనవాసీ శబరి బాలికా నిలయం, కొమరం భీం విద్యార్థి నిలయానికి 50 కేజీల బియ్యం, 45 వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, పండ్లను అందజేశారు.ఈ సందర్భంగా శబరి బాలికా నిలయం కార్యదర్శి బండా స్వరూపరాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లక్ష్మణాచారి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి, దాతల సహకారంతో వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్ననిలయ కమిటీ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని సూచించారు.విద్యార్థుల క్రమశిక్షణ, సంస్కారం, అద్భుతంగా శ్లోకాలు పఠించే విధానం దాతలను ఆకర్షిస్తున్నాయని వారి ప్రతిభను గుర్తించిన పలువురు దాతలు ప్రతి ఏటా సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. దాతల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించాలని కోరారు. ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ విద్యార్థినిలయాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్య ఎంతో ముఖ్యమని, తమ కోసం కష్టపడుతున్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలంటే పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడాలని సూచించారు. వనవాసీ కళ్యాణ పరిషత్ దేశవ్యాప్తంగా గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం అనేక వసతి గృహాలను ఏర్పాటు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది దాతలు ముందుకు వచ్చి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కొమరం భీం నిలయం కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యులు పోలిన రమాదేవి, సుజాత, నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, లక్ష్మణాచారి మిత్రులు ముదిగొండ సతీష్, కొండేటి చంద్రశేఖర్, కొట్ర సంపత్ కుమార్, చల్లా పవన్, ముత్యాల సతీష్, చింతల శ్రీనివాస్, బత్తుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం అవసరం

- మండల విద్యాశాఖ అధికారి కె. పద్మ



భద్రాచలం, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఎంతగానో దోహదపడుతుందని భద్రాచలం మండల విద్యాశాఖ అధికారి కె. పద్మ అన్నారు.ఈ సందర్భంగా మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో రెండో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, వారి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఉచిత యూనిఫాంలు, నోటు పుస్తకాలు, కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపిస్తూ, వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.అనంతరం ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడిన ఆమె, మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్, మండల రిసోర్స్ పర్సన్ రామకృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బీజేపీ సమరభేరి

చర్ల, నవంబర్ 06: (ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సమరభేరి మోగించాలని నిర్ణయించింది. శుక్రవారం చర్ల మండల బీజేపీ ముఖ్య కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు నూప రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రధాన సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మండలంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వెంటనే రహదారుల మరమ్మతులు చేపట్టి ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రోడ్లపై గోవులు స్వేచ్ఛగా సంచరించడం వల్ల వాహనదారులతో పాటు మూగజీవాలకు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి గో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి కార్యక్రమంలో పార్టీ తరఫున వినతిపత్రాలు సమర్పించాలని సమావేశంలో నిర్ణయించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా నిలిచిపోరాటం చేస్తుందని నాయకులు అన్నారు. గ్రామీణ ప్రాంతాల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి వారం ఒకరోజు మండలంలోని ప్రతి గ్రామపంచాయతీని పార్టీ నాయకులు, కార్యకర్తలు సందర్శించి ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. ముఖ్యంగా అర్హులైన పట్టభద్రులందరికీ ఫారం–18 ద్వారా ఓటరు నమోదు చేయించే బాధ్యతను పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూప రమేష్, ప్రధాన కార్యదర్శి బి. సందీప్, జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు, మీడియా కో–కన్వీనర్ నూప లక్ష్మణ్, జిల్లా ఎస్టీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఉయిక సరోజిని (రోజా), ఉయిక తులసి, మండల కార్యదర్శి ఎం. శ్రీనివాసాచారి, మండల యువమోర్చా నాయకుడు పర్సిక వినయ్, మండల కమిటీ సభ్యులు సీహెచ్. విశ్వనాథ్, పొడియం కనకరావు, ఉయిక రాంబాబు, కల్లూరి నాగేంద్ర, కోరం రాజేష్ తదితరులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న జడ్జి శివనాయక్‌కు ఘన సత్కారం

► భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ



భద్రాచలం, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివనాయక్ నల్లగొండకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ప్రాంగణంలో ఘనంగా వీడ్కోలు సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అందించిన సేవలను న్యాయవాదులు కొనియాడారు. పేదలకు త్వరితగతిన న్యాయం అందించడంతో పాటు న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించారని ప్రశంసించారు. న్యాయవాదులతో సమన్వయంగా వ్యవహరిస్తూ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. అనంతరం శివనాయక్ మాట్లాడుతూ భద్రాచలంలో పనిచేసిన కాలం ఎంతో సంతృప్తినిచ్చిందని, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందించిన సహకారాన్ని మరువలేనని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసల శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దుర్గాభవాని, ఐటీడీఏ పీవో బి. రాహుల్, భద్రాచలం సీఐ ఎస్. రాజు, మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొని శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో జడ్జిని ఘనంగా సత్కరించారు.

యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య

► భార్య పుట్టింట్లో ఉంటుండటంతో మనస్తాపం చెందినట్లు సమాచారం.

► ఇద్దరు కుమారులు.. తండ్రి మృతితో కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు



పాల్వంచ, నవంబర్ 6, ప్రజాజ్యోతి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నాగారం కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. కాలనీకి చెందిన బానోత్ రాము (35) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము భార్య శైలజ (28) గత పది నెలలుగా పుట్టింట్లో ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రాము ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడు రాముకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరికి ఎనిమిదేళ్లు, మరొకరికి ఐదేళ్లు. కుటుంబానికి ఏకైక కుమారుడైన రాము మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారులు తండ్రిని కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నాళ్లు ఈ నిరీక్షణ..?

- దూర ప్రాంతాలకు బస్సులేవీ..?
- చర్ల ప్రయాణికుల గోడు పట్టదా..?
- హైదరాబాద్, విజయవాడ, గుంటూరుకు బస్సులేవీ..?
- చర్ల ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు..
- ద్రుష్టి సారించని ఆర్టీసీ అధికారులు..!





చర్ల, నవంబర్ 06: (ప్రజా జ్యోతి): చర్ల మండలం నుంచి హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు నేరుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న చర్ల మండల ప్రజల రవాణా అవసరాలను అధికారులు గుర్తించి దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా ప్రయాణించే సౌకర్యం ఉన్నప్పటికీ, ఆర్టీసీ తరఫున సరైన బస్సు సదుపాయం అందుబాటులో లేకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. చర్ల నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ లేదా ఏసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి రావడంతో ప్రయాణ ఖర్చులు పెరుగుతున్నాయని ముఖ్యంగా కుటుంబాలతో ప్రయాణించే వారు ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కనీసం ఒక బస్సు సర్వీసునైనా ప్రారంభిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు చర్ల నుంచి హైదరాబాద్‌కు ప్రతిరోజూ ప్రయాణికుల రాకపోకలు కొనసాగుతున్నప్పటికీ ఆర్టీసీ అధికారులు ఈ మార్గంలో సర్వీసులు ప్రారంభించకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నేరుగా బస్సులు నడిపితే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు ఆర్టీసీకి కూడా ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంటున్నారు. చర్ల మండలంలో అధిక సంఖ్యలో రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. పంట చేతికి వచ్చిన తరువాత మిర్చిని నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీల కోసం గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడుతోంది. అయితే చర్ల నుంచి ఆయా ప్రాంతాలకు నేరుగా బస్సు సర్వీసులు లేకపోవడంతో రైతులు ముందుగా భద్రాచలం చేరుకుని, అక్కడి నుంచి విజయవాడ, గుంటూరు బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది అని ఈ విధానం వల్ల అదనపు ప్రయాణ సమయం ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులతో నిరంతరం బిజీగా ఉండే రైతులకు నేరుగా బస్సు సౌకర్యం కల్పిస్తే ఎంతో వెసులుబాటు కలుగుతుందని చెబుతున్నారు. అదేవిధంగా చర్ల మండలానికి చెందిన వ్యాపారులు కొనుగోళ్లు, ఇతర వ్యాపార లావాదేవీల కోసం విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు తరచూ వెళ్తుంటారు అని నేరుగా బస్సులు లేక పోవడంతో భద్రాచలం వెళ్లి అక్కడి నుంచి ప్రయాణించాల్సి వస్తోంది అని వారు అంటున్నారు. చర్ల నుంచి విజయవాడ, గుంటూరుకు నేరుగా బస్సు సర్వీసులు అందుబాటులోకి వస్తే వ్యాపారులు తమ పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి చేరుకోవడానికి సులభంగా ఉంటుందని అంటున్నారు. విద్యార్థులకూ ఈ సమస్య తప్పడం లేదు. ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సుల కోసం పలువురు విద్యార్థులు హైదరాబాద్‌తో పాటు విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్తున్నారు. నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో మధ్యలో బస్సులు మారాల్సి వస్తోంది అని దీనివల్ల ప్రయాణంలో ఇబ్బందులు ఎదురవడంతో పాటు సమయం, డబ్బు వృథా అవుతున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంటున్నారు. అత్యవసర పనులపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన సాధారణ ప్రజలు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. చర్ల నుంచి హైదరాబాద్, విజయవాడ, గుంటూరుకు నేరుగా బస్సు సర్వీసులు ప్రారంభించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు అనుకూలమైన సమయాల్లో సర్వీసులు నడిపేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు. చర్ల నుంచి దూర ప్రాంతాలకు బస్సు సర్వీసుల కోసం " ఎన్నాళ్లు ఈ నిరీక్షణ"...? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఏజెన్సీ పంచాయతీల్లో ఉప సర్పంచులకు చెక్ పవర్ రద్దు చేయాలి

■ PESA చట్టాన్ని 100 శాతం అమలు చేయాలి.. రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం డిమాండ్

■ త్వరలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయిస్తాం: గొగ్గల ఆర్మే దొర, కొమరం శ్రీను



పినపాక, నవంబర్ 6(ప్రజాజ్యోతి) ఐదో షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాల్లో పంచాయతీ విస్తరణ చట్టం (PESA Act)ను 100 శాతం అమలు చేయాలని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రికి సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు గొగ్గల ఆర్మే దొర, ప్రధాన కార్యదర్శి కొమరం శ్రీను మాట్లాడుతూ.. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధమైన గుర్తింపు లభించిందని తెలిపారు. అయితే ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ గిరిజనుల ప్రత్యేక హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, స్వయం పాలనకు రక్షణ కల్పించేందుకు PESA చట్టం రూపొందించబడిందని పేర్కొన్నారు. దిలీప్ సింగ్ భూరియా కమిటీ సిఫారసుల ఆధారంగా రూపొందిన PESA చట్టం ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభలకు ప్రత్యేక అధికారాలు కల్పించారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2011 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంత గ్రామపంచాయతీల్లో ఉప సర్పంచులకు చెక్ పవర్ కల్పించడం PESA చట్ట స్ఫూర్తికి, ఆదివాసీ ప్రత్యేక హక్కులకు విరుద్ధమని సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమల్లో ఉన్న 1/59, 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టాలు, ఇతర గిరిజన రక్షణ చట్టాల స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. దేశంలోని ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాలు కలిగిన పది రాష్ట్రాల్లో తెలంగాణలో ఉప సర్పంచులకు చెక్ పవర్ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఏజెన్సీ గ్రామపంచాయతీల్లో ఉప సర్పంచులకు కల్పించిన చెక్ పవర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆదివాసీ గ్రామసభల స్వయం పాలన హక్కులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించకపోతే అతి త్వరలోనే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని గొగ్గల ఆర్మే దొర, కొమరం శ్రీను స్పష్టం చేశారు.

తక్కువ తూకంతో సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు

- నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 6 కేసులు నమోదు.
- కొత్తగూడెంలో బియ్యం, కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు
- జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 6, ప్రజాజ్యోతి: వినియోగదారులకు నిర్ణీత తూకం కంటే తక్కువగా సరుకులు విక్రయిస్తూ మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు.సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని బాబుక్యాంప్, పెద్దబజార్ ప్రాంతాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు బియ్యం దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాలను తూకం వేయగా, 26 కిలోలుగా పేర్కొన్న బస్తాల్లో కేవలం 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు గుర్తించారు.ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై మొత్తం ఆరు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కూచన మనోహర్ మాట్లాడుతూ, వ్యాపారులు ప్యాకింగ్ చేసిన సరుకులపై నికర బరువును స్పష్టంగా ముద్రించాలని, ప్రకటించిన బరువుకు అనుగుణంగానే వినియోగదారులకు సరుకులు విక్రయించాలని సూచించారు. బస్తాలపై పేర్కొన్న బరువు కంటే తక్కువగా సరుకులు విక్రయించినా, తూనికలు, కొలతల నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.వినియోగదారులు సైతం సరుకులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ముద్రించిన నికర బరువును, తూకాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. వ్యాపారులు నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని, వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి తెలిపారు.

మార్కెట్ కమిటీ ఆదాయానికి తక్షణమే టెండర్లు నిర్వహించాలి

- గత 23 ఏళ్ల మార్కెట్ ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ జరపాలి
- ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరపా రాజు డిమాండ్



భద్రాచలం, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీలో మార్కెట్ ఫీజుల వసూళ్లకు సంబంధించి గత 23 ఏళ్లుగా కొనసాగుతున్న విధానంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరుగు రాజగోపాల్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు గడువు ముగిసినప్పటికీ పాత విధానంలోనే ఫీజుల వసూళ్లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, మార్కెట్ కమిటీకి మరింత ఆదాయం సమకూరేలా పారదర్శక టెండర్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. గత 23 ఏళ్లుగా జరిగిన మార్కెట్ ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి సంబంధించిన పూర్తి లెక్కలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నోటిఫికేషన్ వరకు అవకాశం

- గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి కాదు: కొత్వాల
- పాల్వంచ తహశీల్దార్‌తో ఓటరు నమోదు ప్రక్రియపై చర్చ



పాల్వంచ, నవంబర్ 6, ప్రజాజ్యోతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ అయినప్పటికీ, ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఓటరు నమోదు దరఖాస్తులకు గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి కాదని పేర్కొన్నారు.శుక్రవారం పాల్వంచ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ దారా ప్రసాద్‌తో కొత్వాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై చర్చించారు. నవంబర్ 6 చివరి తేదీ అనంతరం ఓటరు నమోదు అవకాశం, దరఖాస్తు ఫారాలు, అవసరమైన ధ్రువపత్రాలు, గెజిటెడ్ అధికారి సంతకం అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు విషయమై తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించడంతో పాటు తన ఓటరు నమోదు దరఖాస్తును అందజేశారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ, 2023 నవంబర్ 1 నాటికి మూడేళ్లకు తక్కువ కాకుండా పట్టభద్రులై ఉన్న అర్హులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రోజు వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పాల్వంచలో పట్టభద్రుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 4,576 మంది ఓటర్లు ఉండగా, నవంబర్ 6 నాటికి 6,641 మంది పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారని కొత్వాల తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు వెంటనే ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ వజ్జ లలిత, కాంగ్రెస్ నాయకులు మహిపతి రామలింగం, కొండం వెంకన్నగౌడ్, పైడిపల్లి మహేష్, నందా నాయక్, చౌగాని పాపారావు, వాసుమల్ల సుందర్‌రావు, శరపా పాపారావు, జక్కుల రాము, జూపూడి ప్రభాకర్, వజ్జ నరేష్ పాల్గొన్నారు.



భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలకు ముందడుగు

- భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే వెంకట్రావు, ఐటీడీఏ పీవో రాహుల్



భద్రాచలం, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మరో ముందడుగు పడింది. ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు ప్రారంభించేందుకు అవసరమైన భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్ శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణంలో స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని చూపించి, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను వివరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రాచలం ఏరియా ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంగా ఉన్న భద్రాచలానికి తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో సీటీ స్కాన్ వంటి ఆధునిక వైద్య పరీక్షల సదుపాయం అందుబాటులోకి వస్తే రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

భద్రాచలంలో మోడల్ మార్కెట్ ఏర్పాటుకు కసరత్తు

- రూ.కోటి నిధులతో మార్కెట్ నిర్మాణం
- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో



భద్రాచలం, నవంబర్ 6 (ప్రజా జ్యోతి): పట్టణంలోని రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో మోడల్ మార్కెట్ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయగా, మార్కెట్ యార్డులో నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్ పరిశీలించారు.ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే రైతులు తాము పండించిన కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలను నేరుగా విక్రయించుకునేందుకు అవకాశం కలుగుతుంది. మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంటుంది. కొనుగోలుదారులకు కూడా నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి.రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో మోడల్ మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో స్థల పరిశీలన చేపట్టారు. నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే భద్రాచలం పరిసర ప్రాంతాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

భజన మందిరం వద్ద తాగునీరు వృథా

- పాడైన పబ్లిక్ ట్యాప్‌తో రోడ్డుపైకి ప్రవహిస్తున్న నీరు,
- మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని స్థానికుల విజ్ఞప్తి



పాల్వంచ, నవంబర్ 6, ప్రజాజ్యోతి: పట్టణంలోని భజన మందిరం (గుడి) ఆవరణలో ఉన్న పబ్లిక్ ట్యాప్ నుంచి గత కొంతకాలంగా తాగునీరు నిరంతరం వృథాగా పోతోంది. ట్యాప్ పాడైపోవడం లేదా సరిగా మూయకపోవడంతో రోజంతా నీరు రోడ్డుపైకి ప్రవహిస్తూ విలువైన తాగునీరు వృథా అవుతోంది.ఒకవైపు పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు వేల లీటర్ల నీరు ఇలా వృథా కావడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాప్ నుంచి ప్రవహిస్తున్న నీరు రోడ్డుపై నిలిచి బురదగా మారడంతో భక్తులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిల్వ నీటితో దోమలు పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత మున్సిపల్ అధికారులు, తాగునీటి సరఫరా విభాగం తక్షణమే స్పందించి పాడైన ట్యాప్‌కు మరమ్మతులు చేపట్టాలని లేదా కొత్త ట్యాప్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తొమ్మిదో రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

- సమాన పనికి సమాన వేతనం.. ఉద్యోగులను క్రమ బద్ధీకరించాలి
- పెండింగ్ సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింప జేయాలని ఉద్యోగుల డిమాండ్



పాల్వంచ, నవంబర్ 6, ప్రజాజ్యోతి: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు ధర్నా నిర్వహించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగుల ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 78 విభాగాల్లో 17,541 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గత 20 ఏళ్లుగా ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు కృషి చేశామని గుర్తు చేశారు.ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాల విషయంలో వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాల మాదిరిగా తెలంగాణలో కూడా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.క్రమబద్ధీకరణ జరిగే వరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, జీఓ నెం.1195 వల్ల తగ్గిన వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వార్షిక వేతన పెంపు, విధేయత ప్రోత్సాహకాలను విడుదల చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించడంతో పాటు కారుణ్య నియామకం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు ముగింపు పలికేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల ప్రతినిధులు కోరారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ముదిగొండ ప్రశాంత్



ములకలపల్లి, నవంబర్ 6 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ముదిగొండ ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ములకలపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. వెంటనే టాయిలెట్లు నిర్మించాలని, కళాశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రతను కాపాడాలని కోరారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కళాశాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భార్గవి, అక్షయ, దుర్గ, నివాస్, దాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు శనగవరపు సంజయ్, చరణ్, స్వప్న, పల్లవి, రవీందర్, శ్రీరామ్, చంద్రశేఖర్, జీవన్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆపద వేళ ఆపన్నహస్తం అందించిన ఎమ్మెల్యే జారె!

- తుఫాన్ బాధిత కుటుంబానికి నిత్యావ సర సరుకుల పంపిణీ
- బాధితురాలిని పరామర్శించి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు హామీ..
- నిలిచిపోయిన పింఛన్ ఇప్పించిన ఎమ్మెల్యే





ములకలపల్లి, నవంబర్ 6 (ప్రజాజ్యోతి): ఆపదలో ఉన్న తుఫాన్ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆపన్నహస్తం అందించారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన అనుకోజు వరలక్ష్మి నివాస గృహం ఇటీవల సంభవించిన మురసు తుఫాన్ ప్రభావంతో పూర్తిగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బాధితురాలి ఇంటిని సందర్శించి పరామర్శించారు. ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలైన వరలక్ష్మి తనకు ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ గత ఆరు నెలలుగా నిలిచిపోయిందని, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతా హోల్డ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పింఛన్ నగదే తన జీవనాధారమని, ఎలాగైనా ఇప్పించాలని వేడుకున్నారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జారె బ్యాంకు మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి నిలిచిపోయిన పింఛన్ నగదును ఇప్పించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక సర్పంచ్ కుంజా వినోద్ ఆధ్వర్యంలో ఆర్ఐ సోయం రాంబాబు బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇల్లు కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తక్షణ అవసరాల నిమిత్తం సాయం అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ రామాచారి, కాంగ్రెస్ నాయకులు కొవ్వాకుల గిరి, ఎస్కే జానీ, జేపీఓ నవీన్, పంచాయతీ కార్యదర్శి సునేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేపిస్తే జైలే..!

- అప్పు పేరుతో వెట్టి చేయిస్తే నేరం..బాధితులకు అండగా ఉచిత న్యాయం
- పేదలకు, మహిళలకు, కార్మికులకు లీగల్ ఎయిడ్ ఉంది..!
- మణుగూరు కోర్టులో న్యాయ చైతన్య సదస్సు.. హక్కులపై అవగాహన సదస్సు...!





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు. నవంబర్ 6, (ప్రజాజ్యోతి) : – వెట్టిచాకిరీ వంటి బలవంతపు శ్రమ నుంచి విముక్తి పొందేందుకు చట్టపరమైన రక్షణ ఉందని మణుగూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. సూరి రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మణుగూరు కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా నాల్సా వెట్టిచాకిరీ విముక్తి అంశాల పై న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. అప్పులు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర ఒత్తిళ్ల కారణంగా ఎవరినైనా వారి ఇష్టానికి విరుద్ధంగా పనిచేయించడం చట్టవిరుద్ధమని తెలిపారు. అప్పు తీర్చే పేరుతో స్వేచ్ఛను హరించడం నేరమని హెచ్చరించారు. చేసిన పనికి తగిన ప్రతిఫలం పొందడం, స్వేచ్ఛగా జీవించడం ప్రతి వ్యక్తి హక్కు అని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు బాధితులు భయపడకుండా అధికారులను సంప్రదించాలని సూచించారు. న్యాయసేవాధికార సంస్థలను ఆశ్రయిస్తే తగిన రక్షణ లభిస్తుందని భరోసా ఇచ్చారు. న్యాయసేవల ముఖ్య ఉద్దేశం సామాన్య ప్రజలకు న్యాయాన్ని చేరువ చేయడమేనని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, కార్మికులు, ఇతర అర్హులైన వర్గాలకు ఉచిత న్యాయసహాయం అందుబాటులో ఉందని మెజిస్ట్రేట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్. సావిత్రి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వైరా ఎమ్మెల్యే కుమార్తె నిశ్చితార్థ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 6, ప్రజా జ్యోతి: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పెద్ద కుమార్తె గాయత్రి నిశ్చితార్థ వేడుక హైదరాబాద్ లోని జూబ్లీ కన్వెన్షన్ లో అంగరంగ వైభవంగా జరిగింది. బంజారా జాతి సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో జరిగిన ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ మంత్రులు, ఎం ఎల్ ఏ లు,నలుమూలల నుండి బంజారా ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఎమ్మెల్యే పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి GLS JAC నాయకులు ఇష్లావత్ లక్ష్మణ్ నాయక్ జేఏసీ చైర్మన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్, జేఏసీ కో చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ శ్రీనివాస్ నాయక్గిరిజన నాయకులు భూక్యా కిరాణా నాయక్, విజయ్ నాయక్ హాజరయ్యారు.వారు నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి,ఆశీర్వదించారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ని, వారి కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.బంజారా సంప్రదాయ వాయిద్యాలు, నృత్యాలతో కన్వెన్షన్ ప్రాంగణం కోలాహలంగా మారింది. వచ్చిన అతిథులకు ఎమ్మెల్యే కుటుంబం ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చింది. నూతన జంటకు జీవితాంతం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని హాజరైన వారంతా ఆకాంక్షించారు. ఈ వేడుక ఐక్యతకు,ఆత్మీయతకు ప్రతీకగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు.